

# డాబుసరి డాక్టరు

మన శరీరం కొన్నికొన్ని పార్థివ పదార్థములవల్ల పోషింప బడుతున్నది. ఒక్కొక్కప్పుడు అందొకొక్కటి తక్కువై పోతుంటే,—ఆ తగ్గిపోయిన లోపం పూర్తిగావింపక పోవడంవల్ల ఒక్కోరకం వ్యాధి వస్తుంటుంది—. ఇది మూలసూత్రం.

కాబట్టి, శరీరంలో ఏ పార్థివ పదార్థం నశింపై పోవడంవల్ల ఏ వ్యాధి బాధ సంప్రాప్తించిందో దాన్ని తెలుసుకోవడం "డాక్టరు" యొక్క "గుణ పరీక్ష". తెలుసుకొన్న తర్వాత నశింపై పోయినది తిరుగ దానికి సమకూర్చి తన్నివారణోపాయం కల్పించడం "వైద్యుడు". గుణపరీక్షా నైపుణ్యం గల్గి వ్యాధికిదగ్గ మందిచ్చి వైద్యం జేయువాడు "వైద్యుడు".

కవుల్లో కావాల్సినన్ని రకాలున్నట్లు వైద్యుల్లోనూ వేలకు వేలున్నారు వివిధ విధాలవాళ్లు. ఎన్నున్నా ఈ డాక్టర్లనుమటుకు వాళ్ల వాళ్ళ శక్తి సామర్థ్యాల్నిబట్టి మూడు నాలుగు విధాలుగా విభజింపవచ్చు.

"తెలిసినవాళ్లూ—తెలియనివాళ్లూ' —అనే ఈ రెండూ ఉండనే ఉన్నయ్ అవి పోగా మిగిల్నవే—.

గవర్నమెంటు కాలెజేస్‌ల్లో చదివి, చదివింది బుఱ్ఱకెక్కినా ఎక్కక పోయినా ఏదోవిధంగా "డిగ్రీ" ఒకటి పేరుకు అటోయిటో, వేసుకోవడానికి ఆధారం జేసుకొని వైద్యాన్ని ఆరంభించేవాళ్లు—పాటువడి నిజంగా వైద్యం క్షుణ్ణంగా నేర్చి రంగంలోకి దిగేవాళ్లు—వీళ్లు "రిజిష్టర్డ్ ప్రాక్టీషనర్సు"—

రెండవరకం:- గవర్నమెంట్ కాలెజెస్‌గాని వానిలో, చదివి తయారయి వచ్చినవాళ్లు. వీళ్ళల్లోనో పై జెప్పిన చొప్పున ద్వివిధాలవారూ ఉంటారు. ఐతే ఒక్కటి తక్కువ. "రిజిస్ట్రేషన్"—నాంబడా!!

మూడవరకం:- కాలెజ్ మొగ మెఱుగకపోయినా డబ్బోదుబ్బో చెల్లించుకొని తిరుగుటపాలో గజన్నర పొడవు సర్టిఫికేట్ (డిప్లమో సంపాదించి సాధారణజనాన్ని మోసపుచ్చే వాళ్లు—

అదీ లేకపోయినా తమ తమ తాతా తండ్రుల తరతరాల్నుండీ సాంప్రదాయపూర్వకంగా సంక్ర

శ్రీ ఎఱుకలపూడి గోపాలకృష్ణారావు

మిస్తోన్న వైద్యవిద్యా పారీణులు. భిషగ్వరులు! వీళ్ళనుగురించి విశేషించి వ్రాయనక్కర్లేదు. జగద్విదిత యశో విశాలురు వీరు!!

ఇంకమిగిలిన జనాభా ఉంది చూశారూ! అదంతా దండుగ మారి దండు! ఐనా హడావుడి కేందక్కువలే——.

అసలు ప్రపంచకంలో ఏ ఉద్యోగం వల్ల లాభమున్నా లేకపోయినా వైద్యం వల్లమాత్రం పొట్టగడుస్తుంది, అంతో యింతో. ఆధిక్యతా గల్గుతుంది! అందుచేగూడ, అధిక సంఖ్యాకులు అడుగు వేస్తుంటా రిందులోకే——విషయం దెలిసినా దెలియకపోయినా- ప్రవేశమున్నా లేకున్నా- నిరుద్యోగ సమస్యాపరిష్కారార్థం, ఉదర పోషణార్థం——. అసలా మాటకేవస్తే—— ప్రపంచకంలో వైద్యుడుగాని వాడెవడు? వైద్యం దెలియనివాడెవడు!! కడుపులో నొప్పికి వాంపోచ వేసుకోమన్నా- వాడూ వైద్యుడే—— అదీ వైద్యమే——కాదూ??——

ఇపుడు వ్రాయబోయే మావాడి సమాచారం మీరు చిత్తగించిందర్వాత వాడేతరగతి రకంవారో-వాడో మహాశయులు గావున నిర్ణయింతురు గాక.

వాకిట్లో కట్టించిన "బోర్డును" బట్టి వాడిపేరు "సుబ్బరాయన్." అసలుకు "సుబ్బారావు." ఇంట్లోవాళ్ళకు "సుబ్బాయ్! సుబ్బిగా!!" ఫ్రెండ్సుకు సుబ్బారాయుడు, గుత్తిసుబ్బారాయుడు.

వీడికి డిగ్రీలక్రింద యించుమించుగా రమారమి, యిరవై యారు అక్షరాలూ ఉన్నాయ్ నిక్షేపంగా—— కాని. ఎలావచ్చినీయూ? ఎట్లాంటివా??.

అనేదే అనుకోవాల్సిన సంగతి. F. R. I. E. S. ఒకటి ముఖ్యంముందుగా ఉంది. తక్కింగలవీ యిలాంటివే దాదాపు. ఊహించుకోలేరూ? వైద్యానికి సంబంధించినవైనా గాకపోయినా - అమాంబాపులూ— అదే ఎంతవఱకూ కమ్మిందో చూడండి.

ఇక పోతే, ఇపుడు సర్వ సాధారణంగా ఏదో ఒకటి "స్పెషలైజ్" జేయడం ఆచారమైంది అందరికీ—— అందుచే మామూలుగా E. N. T. గడిస్తారు. మావాడో?——కను: ముక్కు: చెవి: నోరు: "ఏమిటిని" శారీరంలో ఉన్న సర్వావయాలకీ "స్పెషలిష్టు" నేనని వేసుకొన్నాడు, కాదనేదెవరు? ఖలీజా ఉందీ??——వేయేల మానవుని ఆపాదమస్తకంలో ఉన్న అన్నింటిలో వాడు నేర్వంది లేదుటేదీ- అనుకోటానికే లేండి!

టూకీగా చెప్పి వేయాలంటే మాత్రం వైద్యంలో మా సుబ్బరాయన్‌కు ప్రవేశం సున్నా అనే అనాలె! వీడికి ఎలాంటి మందు మాకు లుండాలంటే—— మనవాళ్ళు చెప్తారే పూర్వం, అశ్వినీదేవతలో ఎవళ్ళో ఉండేవాళ్ళు, వాళ్ళదగ్గరకే గనుక రోగు లేరైనా వచ్చి వాళ్ల వాళ్ల రోగచర్యలు చెప్తుతుంటే చాలు, వాళ్ళగావాల్సిన మందులసంచి దానంతటచే అల్లల్లాడుతుంది - అపు డందుట్లోనుంచి అంత మందిచ్చి పంపితే ఆవ్యాధి బాధ మచ్చుకైనా గనపడేదిగాదు, అని-. అలాగే, "సుబ్బరాయన్‌కూ" తనకడగల మందులు రోగు లేగుదెంచి రోగచర్యలు చెపుతుండే సరికల్లా అల్లలాడుతుంటే అది అంతదీసి వాళ్ళకిచ్చివేస్తూ వైద్యం జేయాలని కుతూహలం. అందుకైనా సమర్థుడో కాడో?? అనుమానమే సుమండీ.

పరికరాలయొక్క విల్వ, అవసరానవసరాలు, తెలిసినా తెలియకపోయినా కావాలనుకోన్నవన్నీ మొగమోటం లేకుండా ముందుగానే కొనుక్కొన్నాడు. వైద్యునికి ఉండవలసిన లక్షణాలన్నీ లక్షణంగానే ఉన్నాయిగాని అసల్దే అడుగంటింది ——. ఏజేస్తాడు?

నానావస్థలూ బడి కష్టనష్టాలకోర్చి, శ్రమ ప్రయాసాల దూరదేశాలకేగి ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో నేర్చుకవచ్చిన వాళ్లకు (డాక్టర్లకు) "స్టెతస్కోప్" మూరెడు పొడుగైతే ——వీడికి బారెడు పొడుగుది! దానికేం తక్కువ??

సుబ్బరాయిన్ వచ్చి "ప్రాక్టీస్"

పెట్టినకొలది వాళ్ళలోనే ఉన్న బిరుదులకు సరిగా వేరొకటి సంప్రాప్తించింది (వచ్చి పడ్డదన్నమాట) అదే "డాబుసరి డాక్టర్!" అంతా అనకుండి ఆగ్రహించుకొంటాడు. అన్వర్థాభిధానుడే— ఐతేమటుకు??

ఆ ఊరి ఆబాలగోపాలాన్కీ "సుబ్బరాయన్" అంటే అర్థమయ్యేదానికన్నా డాబుసరి డాక్టర్ అంటే వగిరం గ్రహింపౌతుంది.

సుబ్బరాయన్ ప్రస్తుతం ప్రాక్టీస్ బెట్టిందో మాదిరీ ప్రదేశం— అంటే అటుపట్నంగాక ఇటు పల్లెగాక మధ్యస్తంగా ఉండేది. పాపం! సుబ్బరాయన్ కున్న తెల్వి తేటలకు ఓపికకు ఉత్సాహ ఉబలాటాలకు ఇక్కడుండాల్సినవాడా? కాలకర్మం బాగుండక పోబట్టిగానీ-ఏరాజపూజితుడో కావాల్సినవాడు! మతికరి బ్రహ్మగా దూ వ్రాసింది మరి! దానిదుంప తెగదానికేమైనా తిరుగుంటా? "నా నటక వ్రాసిన వ్రాలుకన్నగలదే నూరేళ్లుచింతించినన్- అన్నారాయ్! సుబ్బరాయన్ ప్రాక్టీస్ బెట్టిన పట్టున వాడికందవేసిన చేతుల్లేవు లెక్కకెక్కడా ఇదొకందుకు మంచిదే— కాకపోతే "నేటివ్ డాక్టర్లు" కాదు;—(నాటుగా జెప్పాలంటే) "నాటు వైద్యులు" ఒకళ్ళిద్దరున్నారు: నాడీ నిదానం దెలిసినా దెలియక పోయినా, మాతాత అలాంటివాడు మాముత్తాతో చెప్పనే అక్కర్లేదు! హస్తవాసి పస్టు ఆయన దెగ్గరవి అమృతతుల్యాలే! మా నాయనో - అపరధన్వంతరి!!- నేను? వీళ్లందర్నీ తలదన్నిన వాణ్ణి!! "అని గప్పాలుగొట్టే ఏనంబి తంబలి నాంచారయ్యో- గురవయ్యో—. రోగిగావచ్చిన ప్రతి వాడికీ చెయిజూట్టం తడవుగా "ఓ! నీకు వాత పిత శ్లేష్మ ప్రకోపంగా ఉంది" అని అనివేయడం- నాయనమ్మలనాటి మాటలో మాటిన మందు మాకు లేమైన ఉంటె అవి అరగ తీసి పోయడం- మటుకు నేర్చి నెట్టుకొస్తున్నవాళ్ళు గాని, నాలు గింగ్లీషు ముక్కల్తో నాటకం ఆడే నాథుడు లేడు.

సుబ్బరాయన్‌కే అక్కడగ్రతాంబూలం!

"చెట్టులేనిచోట ఆముదం చెట్టేగా మహావృక్షం?" తెలిసీ తెలియని తెలుగువైద్యులకు మాట్లాడితే "వాత పిత్త శ్లేష్మాధిక్యాలు"—ఎవరికే జబ్బైనా—అబ్బీ అబ్బని ఆంగ్లవైద్యులకు—రోగుల చుట్టుపట్ల ఉన్న మొఖాలు నల్లధోర్లవిగా కుంటే రోగి కళత్ర బంధుమిత్ర పుత్రాదులు హడల్ చచ్చేట్లు, అదో మహా మారణవ్యాధి ఆ రోగికొచ్చికే అవనికవతరించినట్లుగా భావించడానిగ్గాను ఆయా రోగాలపేర్లు క్యాటలాగులో చూసి బట్టీ బెట్టైనా ఉఘోషించక, "నామినేటివ్ సింగ్యులారిటీ—అనో ప్లూరాలిటీ నామినేటివ్—" అనో అప్పుడెప్పుడో చదువుకొన్నవి చిందరవందరగ మార్చి "టపీమని" తడవుకోకుండా తబ్బిబ్బుపడకుండా, (ఏదైతేం అసీవేశానికి! అట ఏదికీరాదామె,) వదలివేయడం- అవసరమున్నా లేకున్నా తమకడనున్న సరకు సరంజామంతా ప్రదర్శించే నిమిత్తం. బయటబెట్టి పదిపెట్టం పరీక్షించాలో లేకుండానే పరీక్షించడం- పరామర్శించడం ఆచారం, అలవాటు!! మీదు మిక్కిలి సుఅోమహత్వం గూడా—.

ఆయా రోగులు తిన్న నారింజకాయ తొక్కలూ- ఇత్యాదులేమేనా ఆ పరిసర ప్రాంతాల్లో అదృష్టవశాత్తూ అగపడ్తే— "జోశ్యం" చెప్పడం. "భలానాది తింటంగూడదు!" అని మఱోదానికి "డైట్" మార్చడం! దాంభికంగా దబాయించుక వస్తారు. ఏదో విధంగా—సాగెనన్నాళ్లీ—ఏం శాస్వితం!

ఇదంతా ఇలా ఉండగా—రోగుల చుట్టుపట్ల మొఖాలేవైనా నాలుగింగ్లీష్ ముక్కల్నేర్చినవిగా (వానాకాలపు చదువు కనపడ్తే??—"రిజర్వ్లో" ఉండే, "పయేరియా- డెప్తీరియా ఎమనోరియా డెస్మెనోరియా- లాకేరియా—" మొదలైనవి ఏరియానో ఒకదాన్ని విసరడం— ఇవి ప్రాసబాగా వేసినవిగా జూసి అక్క

పెట్టుకొంటార్లెండి జ్ఞాపకార్థం) గనేరియాలాంటి వింకా కొన్ని ఉన్నా— అవి సర్వసాధారణంగా ఆబాలగోపాలాన్కి తెలిసిఉంటాయి. ఈ వర్తమానకాలం సివిలైజ్‌డ్" కాదుట గాండీ? "సిఫిలైజ్‌డ్‌ట" అందువల్ల అలాంటి మొగాలగ పడ్తేనే గాని అనరు! ఆమాత్రమైనా జ్ఞానం ఉన్న దనుకోవడానికీ అవకాశంలేదే మాత్రం! ఏమండీ— అప్పుడప్పుడు మళ్ళా వప్పులో కాలువేస్తునే ఉంటారు. ఆడా మొగా బేధం లేకుండా అదేదో ఒకటి అంటగట్టేస్తూ — "లొకేరియా"--మొగవాళ్ళకు స్వతం దగిలిస్తే ఏమనాలె??—

ఈ"ట్రంఫే" సుప్రసిద్ధ వైద్యులగు సుబ్బరాయన్ మహాశయుడు! కాని, ఈయనగారిలో ఓ ఆధిక్యతొకటికద్దు! ఏమది? ఇంతకు పూర్వం బేరొ్కన్న వాళ్ళంత అన్యాయంగా గాకుండా ఆ అనే పేర్లైనా సరైనవంటాడు. అంటే, ఇందుకు మీరు వేఱుగా అపార్థందీయకండి!

ఏ "ల్యాటిన్" పేర్లో మతేమో- అర్థంగానివిగా జూసి అంటుంటాడు. ఏమండీ ఏం లాభం?

శారీరంలో ప్రతి ఒకదాన్కి స్పెషలిస్టే—మెడలిస్టే--ఏ మొరుగుతుంది? వాటి స్థానాలే దెలియవామె! యుం బ్రహ్మా!!

జాచ్చుకు చూపెట్టా సీతనిమహిమ!

జబ్బు సంగతి తెలిసిన వ్యాధ్రోగి యెవడేనా ఒకడు పరీక్ష చేయించుకోవడానికి సుబ్బరాయన్‌గారి వద్దకు వచ్చి పరీక్ష చేయించుకోవడంలో వీడు కుడిప్రక్కనే పరీక్షించి కూర్చొని అట్టే ఉన్నట్లు "లెక్చ" ఇస్తుంటే విని, "ఏమండి! సార్!! హార్టెటు! ఉండేది??" అని ఆతడంటా డనుకోండి, వెంటనే మావాడేమంటాడో తెలుసునా??

"అంతేలే—అస్మదాదులు కన్పోని యెన్నుకోసం కావాల్సిన దెసకు మారుస్తుంటారు. అవసరాన్ని బట్టి" అటు దిటూ -ఇటు దటూ—? అని అనేస్తాడు హద్దూ అపూనహీం!

ఇది పోనీండిగానీ — వీడిమందు మాకుల ప్రశంస దీసుకొంటే కొంచెం—సుబ్బరాయన్ శక్తి సామర్థ్యాలకు "కొలతబద్ద" అంతగాడుపయోగించే "ట్వెల్వ్ టి స్యూసాల్ట్సు" వైద్యమే "అంత చదువు చదివి, "అంత చదువు చదివి, అన్నేడ్పి— ఇదేంటీ వైద్య మంటారేమో??—

అనకండీ! "ఎవరు చదివారు? ఎక్కడ చదివారు?? ఏం చదివారు??." అనే ప్రశ్న లాదిలోనే వేసుకొంటే అసలా ధర్మ సందేహమే మీకుదయించదు.

"అయ్యో! డబ్బుతెచ్చిన డిగ్రీలవాడు "డాబుసరి డాక్టరు" గాని మరే మాతాడు??"

ప్రస్తుతం ఇపుడు ఆలోచించవల్సింది ఏమయ్యో అంటే.—

వీడు (మావాడు) "పండ్రెండు పార్థివ పదార్థాల వైద్యం" ప్రాక్టీస్ బెట్టడం ఎందుకా?? అని.

వినండి! ఎందుకో.

మొదటిది:- (వైద్యునకు) హోమియోపతి మందులనేవి అందరికీ అందుబాట్లో ఉంటాయి కొంటానికి. దానవైద్యునికి బాధలేదు. ఒక మందొకసారి కొన్నాడంటే అది వాడె ఆజన్మపర్యంతం పనికివస్తుంది నెట్టుకపోతుంది— ప్రాక్టీస్ లేని మహా మహునికైతే చెప్పక్కర్లేదు.

రెండవది:-(రోగులకు.) చేదుమందులు: కషాయాలు: మింగుడిపడని ఉండలూ: ఇత్యాదు లేముండవ్.

"తీపుల్లేనిరోగం —తియ్యటి మందులూ —"

పంచదారలో పొదిగిన ఔషధపానం! వహ్వ! యిది రోగులకు బాధలేదు. ఇవిగాక ముఖ్యంగా ఓ పెద్ద అపోహ ఒకటి ఆబాల గోపాల్లాన్ని ఆహుతిగొన్నది. శోచనీయం ఐంది!!

ఏమంటే—"హోమియో మందులు వ్యాధి బాధల్ని నివారింపజేస్తే చేస్తాయ్—లేదో- గప్‌చిప్‌గా ఊరుకొంటాయ్" అని.

ఇదేటి సమంజసమైన సంకల్పమో! చూడండి!!

ఏదైనా ఒకటి, ఒక రోగాన్ని పోగట్టగల శక్తి సామర్థ్యాలున్న

దైతే- అదారోగం లేకుండా ఉన్నపుడూరకే యిస్తే చెరుపు సేయదూ??- ముద్దెట్టుకొంటుంది గామోస్—ప్రకృతి విరుద్ధంగాదిది??— తెలియక అఘోరించే అఘోరింపు గాదు??—

ఇదీ పోనీయండి పాడుగొడవ!

శ్రీమాన్ సుబ్బారాయన్ వైద్య విషయ విశేషతనే గురించి మాట్లాడుదాం.

పార్థివ పదార్థాల్ని గురించీ వాటి ఉపయోగాల్ని గురించీ ప్రప్రథమంలోనే ఉదాహరించాను

ఇప్పుడింక చెప్పబోయేది.—

ఆవైద్యమేమన కథానాయకుడు చేయాల్సి వచ్చిందిగాన (చేసేదిగాన) జరిగేతంతు. (జరిపేతంతు )

“ఏ పార్థివ పదార్థమైనా శారీరంలో నశింపై పోతే దానివల్ల గల్గిన వ్యాధిత నివారింపజేయడానికి చేయాల్సిన చికిత్స, ఆపార్థివ పదార్థం దానికి అందించడమే గావున,— అసలున్నవి పంద్రెండేగావున-ఎవరికెపుడే వ్యాధి వచ్చినా, ఆలోచనే అవసరం లేకుండా ఆలస్యాని కవకాశమీకుండా (“ఆలస్యం అమృతంవిషం” అన్నారు కాబట్టి) పంద్రెండూ పంద్రెండు పొట్లాలుగట్టి గానీ- ఒకటిగానే కలిపి వేసి పంద్రెండు మోతాదులుగ జేసి గానీ— (అసలొక మందుతో మరొకటి గలపరాదు. అథవా కలిపినా??—) పంద్రెడుసార్లు లోపల వేసుకునేట్లు చూస్తే “బస్” అంటాడు. వాడి “ఆర్గ్యుమెంట్” ఏమంటే— “ఏ వ్యాధైనా గల్గడానికి కారణం? వాటిలో ఒకటో లోపించడమె_ వ్యాధి పోగొట్టడానికి? అది (లోపించినపదార్థం) తిరిగి “సప్లై” జేయడమె!! ఏది లోపించిందో కనుక్కోటం అనవసరంట. దాన్నిగూర్చి విశేషం చర్చించడం అంతకుముందే....) కాబట్టి అట్టే కష్టపడకుండా “మైండ్‌రొష్టు పడకుండా” పంద్రెండూ కలిపి ఇచ్చివేస్తే సరి— టక్కున కుదుర్తుంది రోగం- అవే ఆయా భాగాలకేగి “మీకు నేగావాలా—మీకు నేగావాలా??” అంటూ అడుగుకొంటూ పోతుంటాయ్. అప్పుడేది, దేనికి, కావాల్సొస్తే అది దాన్ని గ్రహించేస్తుంది. వ్యాధి కుదురుస్తుంది!

తక్కినవో??— (అంటే, వేటికీ అక్కర్లేకపోయినవి) వాటిత్రోవ అవే జూసుకొంటాయ్. “వేస్టుప్రాడక్టు” క్రింద వెళ్ళిపోతాయ్. పోక నిలుస్తాయా?? అంటాడు. “భళీ! భళీ!! అని చెప్పిన అశ్వినీ దేవతల వైద్యం గీద్యం దేనికీ దీనిముందు??—

సుబ్బరాయన్ వాంఛించిందే లభించిందే!!—ఏమాభాగ్యం? “డాబుసరి డాక్టర్!” అనేది తప్పింది గాదు.—

మనవి! ఇందెవర్నేమన్నా, వ్యక్తిగతంగా దీసుకోక మన్నించండి.

ఇంతకూ ఇదంతా ఎందుకొచ్చిన గొడవ? అంటే— ప్రభుత్వంవారున్నారు చూశారూ! వాళ్లలాటి “తెలిసీ తెలియనివాళ్ళను” ముఖ్యంగా “డాక్టరీకి” మటుకు అరికట్టేట్టు చూడాలె, అందుకు సమర్థతున్న వాళ్ళనే ఆరంభింపనీయాలె! ఓ శాసనం బెట్టాలె! ఇలాంటిదెప్పుడో (చంద్రగుప్తుడి కాలంలోనే— “చాణక్యుని అర్థశాస్త్రంలో”) ఉంది, కాని నవనాగరికతా నిపుణులగు బ్రిటిష్ ప్రభుత్వంవారిలో గానరాదు.

ఇంకొకటి—ముఖ్యమైంది—.

ఎవడి తెలివి తక్కువ వాణ్ణే దెబ్బ తీస్తుంది— వాస్తవమే— కాని “వైద్యము?” అలాగాదే— అందుకని అఘోరించిన అఘోరింపిది- ఆలకించేవాళ్లుంటే—మంచిదే లేకుంటే జాన్దేవ్ సెలవు.